కేసీఆర్ ఆశీస్సులతో ప్రజలకు సేవచేశా..

మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ కమల్‌రాజు

శక్తివంచన లేకుండా జిల్లాను అభివృద్ధి చేశా..
ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు
ఈ నెల 6న ముగియనున్న జడ్పీ పాలకమండలి

ఖమ్మం, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉద్యమ నేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో జిల్లాల విభజన తరువాత ఏర్పడిన జడ్పీ పాలకవర్గానికి తొలి చైర్మన్ బాధ్యతలు చేపట్టి ప్రజలకు ఎంతో సేవ చేశానని ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. ఈ నెల 6వ తేదీతో జడ్పీ పాలకవర్గం ముగియనున్న నేపథ్యంలో తన చాంబర్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో తన హయాంలో చేసిన అభివృద్ధిని వివరించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శకంలో, మంత్రిగా పువ్వాడ అజయ్‌కుమార్ సహకారంతో జిల్లా అభివృద్ధికి విశేష కృషిచేశానన్నారు. ప్రజాప్రతినిధుల పూర్తి సహకారం లభించిందన్నారు. జిల్లా పరిషత్‌లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఐదేళ్ల కాలంలో జడ్పీ సాధారణ నిధులతో జిల్లాను ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు, ఉద్యోగోన్నతులు చేపట్టామని తెలిపారు. కరోనా సమయంలో ప్రభుత్వాసుపత్రి చైర్మన్‌గా నిరంతరం సమీక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించినట్లు తెలిపారు. ఈ ఐదేళ్లు సహకారం అందించిన కేసీఆర్‌కు, అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

హామీలు విస్మరించిన కాంగ్రెస్

- **మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య**
- **పదవీ కాలం ముగియనున్న ఎంపీటీసీలకు సన్మానం**

పెనుబల్లి, ఆగస్టు 3 : అబద్ధాలు, మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలను విస్మరించి పూటకో మాట మాట్లాడుతోందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఈ నెల 5న పదవీ విరమణ చేయనున్న ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల సన్మాన కార్యక్రమం కల్లూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం మండల పార్టీ ఆధ్వర్యంలో చేపట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సండ్ర ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇక నుంచి ప్రతిపక్ష స్థానంలో ఉండి.. ప్రజాక్షేత్రంలో ప్రజల పక్షాన పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని ఎన్నికల మ్యానిఫెస్టోలో ఒకేసారి చేపడతామని చెప్పి.. ఇప్పుడు రూ.లక్ష, రూ.లక్షన్నర, రూ.2 లక్షలు ఇలా విడతలవారీగా చేపడుతూ సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే పింఛన్ల పెంపు, రైతుభరోసా, జాబ్‌కార్డు వంటి పథకాలపై స్పష్టత లేదని, వీటన్నింటి గురించి ఇంటింటికి తిరిగి తెలియజేయాల్సిన అవసరం ఇకపై ఉందన్నారు. అనంతరం ఎంపీపీ బీరల్లి రఘు, జడ్పీటీసీ కట్టా అజయ్‌బాబు, బీఆర్ఎస్ ఎంపీటీసీలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, పెనుబల్లి మండల పార్టీ అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, కార్యదర్శి భుక్యా ప్రసాద్, జడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, లక్కినేని రఘు, మేకల కృష్ణ, కాటంనేని వెంకటేశ్వరరావు, సయ్యద్ అలీ, బోబోలు లక్ష్మణరావు, అంజయ్య, పెడకంటి రామకృష్ణ, సీహెచ్.కిరణ్, సయ్యద్ రావు, రామమల్ల నాగేశ్వరరావు, కంభంపాటి రమేశ్, షేక్ కమిలీ, బుర్రి భవానీ, కొరకొప్పుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలు, జడ్పీటీసీలను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

బేతంపూడి సొసైటీ కార్యాలయం ఎదుట రైతుల నిరసన

బేతంపూడి సొసైటీ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు, రైతులు

టేకులపల్లి, ఆగస్టు 3 : ఎలాంటి షరతులు, కొర్రీలు లేకుండా వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులందరి రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సేవాలాల్ సేన ఆధ్వర్యంలో రుణమాఫీ కాని రైతులతో కలిసి మండల కేంద్రంలోని బేతంపూడి సొసైటీ కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుణమాఫీ కోసం బ్యాంకుకు వెళితే తీరొక్క షరతులు పెడుతున్నారని, దీంతో రుణం తీసుకున్న రైతులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. కొందరు బ్యాంకు అధికారులు పోడు, అసైన్డ్, జంగ్ సిపాయి పట్టాలకు రెండు బ్యాంకుల్లో రుణాలు ఉంటే రుణమాఫీ కాదని చెబుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు, కొర్రీలు లేకుండా రుణమాఫీ చేయాలని, లేదంటే అన్ని డీసీసీబీ కేంద్రాలను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బానోత్ ఊక్లనాయక్, సేవాలాల్ సేన జిల్లా కో కన్వీనర్ మాలోత్ శివనాయక్, ధరావత్ కృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

- **సీఎం రేవంత్ మాటలపై భగ్గుమన్న ఉపాధ్యాయులు**
- **కించపరిచే మాటలను వెంటనే వెనక్కు తీసుకోవాలి**
- **సర్కారు టీచర్ల పిల్లలు చదివేది 'ప్రైవేట్'లో కాదా?**
- **ప్రభుత్వ కొలువులకు నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్**

ప్రైవేట్ టీచర్లంటే.. అలుసెందుకు..!

"రాష్ట్రంలోని ప్రైవేట్ స్కూళ్లలో ఇంటర్ పాసైనోళ్లు, డిగ్రీ ఫెయిలైనోళ్లే పాఠాలు చెప్తున్నారు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం చేసిన వ్యాఖ్యలపై ఖమ్మం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ ఉపాధ్యాయులు భగ్గుమన్నారు. సీఎం హోదాలో ఉండి ఇటువంటి మాటలు మాట్లాడడం సరైందికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. తామెంతో కష్టపడి ఉన్నత చదువులు చదువుకున్నామని, ప్రభుత్వ ఉద్యోగాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కోసం ప్రైవేటు పాఠశాలల్లో టీచర్లుగా పని చేస్తున్నామని తెలిపారు. అరకొర వేతనాలతో కాలం వెళ్ల దీస్తున్న తమను కించపరిచే విధంగా మాట్లాడడం సీఎంకు తగదన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో కూడా క్వాలిఫైడ్ ఉపాధ్యాయులనే తీసుకుంటారని, ఇంత చిన్న విషయం ముఖ్యమంత్రికి తెలియదా.. అని ప్రశ్నించారు. అసలు ప్రభుత్వ టీచర్ల పిల్లలు చదివేదే ప్రైవేట్ విద్యాసంస్థల్లో అనే విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రైవేటు టీచర్లు అంటే ఆయనకు అలుసుగా మారిందని, సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడే విధానం ఇది కాదన్నారు. తమను తక్కువ చేసి మాట్లాడే ముందు పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు వేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని హితువు పలికారు. - ఖమ్మం, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ప్రభుత్వ టీచర్ల పిల్లలు ఎక్కడ చదువుతున్నారు..

ప్రభుత్వం నుంచి వేలు, లక్షల్లో జీతాలు తీసుకునే ప్రభుత్వ ఉపాధ్యాయులు వారి పిల్లలను లక్షలు లక్షలు ఫీజులు చెల్లిస్తూ ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివించడాన్ని ఏ రకంగా చూడాలి. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రభుత్వ టీచర్లంటే అభిమానం ఉంటే టీచర్ల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించేలా చట్టం తీసుకురావాలి. అప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ ఏటికేడు పెరగడంతోపాటు ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతమవుతుంది. అంతేకానీ ప్రైవేటు టీచర్ల పట్ల చులకనభావంగా సీఎం స్థాయిలో మాట్లాడడం చాలా బాధాకరం. ప్రతి ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు బాల్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వాడే. ప్రైవేటు టీచర్ల వ్యవస్థలో సైతం మేధావులు ఉన్నారని గ్రహించాలి.
– నారపోగు నాగయ్య(ఎంఎస్సీ, బీఈడీ), ప్రైవేటు టీచర్, ఖమ్మం

సీఎం వ్యాఖ్యలు బాధాకరం

ప్రైవేటు ఉపాధ్యాయులను కించపరిచే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం బాధాకరం. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం జాబ్ నోటిఫికేషన్ ఇవ్వడం చేతకాని సీఎం, ఉన్నత చదువులు చదివి చాలీచాలని జీతాలతో కుటుంబాలను వెళ్లదీసుకుంటున్న ప్రైవేటు టీచర్లను హేళన చేయడం సరికాదు. ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లల్లో అత్యధికులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నది ప్రైవేటు ఉపాధ్యాయులే అన్న విషయం తెలియదా? నిరుద్యోగుల ఓట్లతో సీఎం పీఠం దక్కిందన్న విషయం గుర్తుంచుకోవాలి. సీఎం వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని బేషరతుగా క్షమాపణ చెప్పాలి.
– ఎలికే అనంతరావు(ఎంఏ, బీఈడీ), ప్రైవేట్ టీచర్, దమ్మపేట

ఐదేళ్లు విద్యా వలంటీర్‌గా పనిచేశా..

మాది టేకులపల్లి మండలం రాంపురం పంచాయతీలోని పాతతండా గ్రామం. నేను ఎంఏ, బీఈడీ చదువుకున్నా. గతంలో ఐదేళ్లు తడికలపూడి ప్రభుత్వ పాఠశాలలో విద్యా వలంటీర్‌గా పనిచేశాను. ప్రస్తుతం ఐదేళ్లుగా సులానగర్ కార్మల్ మాత ప్రైవేట్ పాఠశాలలో తెలుగు బోధిస్తున్నాను. ప్రైవేట్ పాఠశాలల్లో బోధించేవారు ఇంటర్ పాసైనోళ్లు, డిగ్రీ ఫెయిల్ అయినోళ్లు అని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం బాధాకరం. ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాలు రాక ఇబ్బంది పడుతున్న మాకు ప్రైవేట్ పాఠశాలలు జీవనాధారంగా ఉన్నాయి. సీఎం పెద్దఎత్తున నోటిఫికేషన్ విడుదల చేసి మాకు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చేలా చూడాలని కోరుతున్నాం. **– భూక్యా రమేష్(ఎంఏ, బీఈడీ), ప్రైవేట్ టీచర్, పాతతండా, టేకులపల్లి**

దళితబంధు యూనిట్లు అమ్మితే కేసులు

చింతకానిలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

దీనికి ప్రత్యేకాధికారి సైతం బాధ్యత వహించాల్సిందే..
మరో వారం రోజుల్లో మళ్లీ దళితబంధుపై సమీక్ష
డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

చింతకాని, ఆగస్టు 3 : దళితబంధు లబ్ధిదారులు తమ యూనిట్లను అమ్మితే గ్రామ ప్రత్యేకాధికారి సైతం బాధ్యత వహించాల్సిందేనని, అమ్మినా, కొన్నా దానిని ప్రభుత్వం నేరంగానే భావిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో 'దళితబంధు పథకం అమలు-పర్యవేక్షణ' అంశంపై కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌తో కలిసి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పథకం ద్వారా అందిన, అమ్మిన, గ్రౌండింగ్ కాని, లాభసాటిగా నడుస్తున్న యూనిట్ల పర్యవేక్షణ తదితర అంశాల గురించి గ్రామ ప్రత్యేకాధికారుల నుంచి వివరాలు సేకరించారు. అలాగే పథకం అమలు తీరుపై పలు అంశాలను భట్టి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా డెయిరీ, గొర్రెల పంపిణీ, పౌల్ట్రీయిన్లు, హార్వెస్టర్లు, ట్రాలీ ఆటోలు సైతం కొద్దిస్థాయిలో అమ్మకాలు జరిగినట్లు డిప్యూటీ సీఎం దృష్టికి తెచ్చారు. జీవాలు, పశువులకు ట్యాగ్ ఉన్నా ఎలా అమ్మారని భట్టి ఎదురు ప్రశ్నించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ పశువులు, జీవాలు చనిపోతే ఎందరికి బీమా అందించారో తెలపాలని పశుసంవర్ధక శాఖ అధికారిని వివరణ కోరారు. తన దగ్గర అలాంటి లెక్కలు లేవని అధికారి సమాధానమివ్వడంతో ఆగ్రహం, అసహనానికి గురయ్యారు. దళిత బంధు యూనిట్లు అమ్మినా, కొనుగోలు చేసినా వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారం రోజుల్లో మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని, అప్పటిలోగా దళితబంధు లబ్ధిదారులు తమకు కేటాయించిన యూనిట్‌తో వ్యాపారాలు చేసుకునేలా ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు అవగాహన కల్పించాలన్నారు. మొదటి విడతలో సగంలో మిగిలిన యూనిట్ లాభసాటిగా నడుపుతున్న లబ్ధిదారులను గుర్తించి వారికి మిగతా సగం యూనిట్ అమౌంట్ లేదా చెక్కును వారం రోజుల్లో జరగనున్న సమీక్ష సమావేశంలో అందజేస్తామన్నారు. దళితబంధు పథకం ద్వారా దళితులు వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకోవాలని, యూనిట్‌లు అమ్మకం, కొనుగోలు జరిపితే చీటింగ్ కేసులకు సైతం ప్రభుత్వం వెనుకాడబోదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఏలూరి శ్రీనివాసరావు, డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యం, జడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిశోర్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

మార్గదర్శకాల ప్రకారం 'ఎల్ఆర్ఎస్' పూర్తి

- **ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**
- **మంత్రి పొంగులేటితో కలిసి కలెక్టర్లతో సమీక్ష**

మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మామిళ్లగూడెం, ఆగస్టు 3 : రాష్ట్రంలో క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎల్ఆర్ఎస్ ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధనశాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి, భూపాలపల్లి కలెక్టరేట్ నుంచి రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్ర పురపాలకశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దాన కిషోర్ ముందస్తుగా ఎల్ఆర్ఎస్ పథకం కింద వచ్చిన దరఖాస్తులు, వాటి ప్రస్తుత స్థితిగతులు, ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రణాళిక మొదలగు వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది లేకుండా, ప్రభుత్వానికి నష్టం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

నాలుగు దశల్లో ఎల్ఆర్ఎస్ స్క్రూట్నీ : మంత్రి పొంగులేటి

మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ 2020 కింద 25లక్షల 70వేల 708 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో ఇప్పటివరకు 4 లక్షల 28వేల 832 దరఖాస్తుల స్క్రూట్నీ చేసి 60వేల 213 దరఖాస్తులను ఆమోదించి, సదరు భూముల క్రమబద్ధీకరణ చేశామని తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దాదాపు 20 లక్షలకు పైగా దరఖాస్తుల స్క్రూట్నీ ప్రారంభించాలని, 4 దశల్లో స్క్రూట్నీ ఉంటుందని తెలిపారు. దరఖాస్తుల ధ్రువీకరణ కోసం ఆగస్టు మొదటి వారం నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి 3నెలల వ్యవధిలో ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని, కలెక్టర్లు పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, డీఆర్డీవో సన్యాసయ్య, డీపీవో హరికిషన్, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

చెరువులు వెలవెల.. అన్నదాతలు విలవిల

- **టీ.పాలెం మండలంలో మళ్లీ వర్షాభావ పరిస్థితులు**
- **ఈ ఏడాది ప్రశ్నార్థకంగా మారిన వరిసాగు**
- **'భక్తరామదాసు' ద్వారా చెరువులు నింపాలని రైతుల వేడుకోలు**

నీరు లేక వెలవెలబోతున్న బచ్చోడు పెద్దచెరువు

తిరుమలాయపాలెం, ఆగస్టు 3 : తిరుమలాయపాలెం మండలంలో ఈ ఏడాది మళ్లీ వర్షాభావ పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు బాగానే కురుస్తున్నప్పటికీ టీ.పాలెం మండలంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఈ ప్రాంతంలో చిరుజల్లులు తప్ప ఎక్కడా చెరువులు, కుంటలు, కోపులు కూడా నిండలేదు. కనీసం సాధారణ వర్షపాతం సైతం నమోదు కాలేదు. మండలంలోని అన్ని గ్రామాల్లో నీరు లేక చెరువులు వెలవెలబోతున్నాయి. దీంతో ఈ ఏడాది వరిసాగు ప్రశ్నార్థకంగా మారడంతో అన్నదాతలు విలవిలలాడుతున్నారు. మండలవ్యాప్తంగా 11 మైనర్ చెరువులు, 57 నోటిఫైడ్ చెరువులు, కుంటలున్నాయి. వాటి పరిధిలో 8,500 ఎకరాల మాగాణి సాగులో ఉంది. రైతులు చెరువులు, కుంటల కింద వరి సాగు చేసేందుకు నార్లు కూడా పోశారు. ప్రస్తుతం వరినారు సిద్ధంగా ఉంది. ఈ తరుణంలో సరైనా వర్షాలు కురవకపోవడంతో మాగాణి భూములన్ని బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. చేసేదేమీలేక అన్నదాతలు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు.

బీళ్లుగా ఉన్న మాగాణి భూములు

భక్తరామదాసు లిఫ్ట్ ద్వారా చెరువులు నింపాలి

భక్తరామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని చెరువులు, కుంటలను నింపి వరి సాగుకు అవకాశం కల్పించాలని రైతులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తిచేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో అత్యంత కరువుపీడిత ప్రాంతమైన తిరుమలాయపాలెం మండలానికి సాగు నీరు అందించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం భక్తరామదాసు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. ఈ పథకం ద్వారా పాలేరు రిజర్వాయర్ నుంచి కృష్ణాజలాలను తిరుమలాయపాలెం మండలంలోని అన్ని చెరువులు నింపింది. దీంతో గత ఆరేళ్లుగా వేసవిలోనూ చెరువుల్లో నీరు ఉండడంతో రెండు పంటలు సాగు చేసుకున్నారు. కరువు సీమ కోనసీమగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది వేసవిలో చెరువుల్లోకి నీరు సరఫరా చేయలేదు. ప్రస్తుతం పాలేరు రిజర్వాయర్‌లోకి నీరు వచ్చినందున శ్రీభక్తరామదాసు లిఫ్ట్ ద్వారా నియోజకవర్గంలోని అన్నిప్రాంతాల్లో చెరువులు నింపి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

చెరువులు నింపి ఆదుకోవాలి..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు తిరుమలాయపాలెం మండలంలో నిత్యం కరువు తాండవించేది. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన భక్తరామదాసు ఎత్తిపోతల పథకంతో మండల రైతుల కష్టాలు తీరాయి. అయితే ఈ ఏడాది మళ్లీ వర్షాలు లేక కరువు వచ్చేలా ఉంది. పాలేరు ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ తీసుకొని 'భక్తరామదాసు' ద్వారా చెరువుల్లోకి నీరు వదిలితే తప్ప వేరే గత్యంతరం లేదు. మండలంలోని చెరువులు, కుంటలు నింపి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.
–పి.సుధాకర్, రైతు, మహ్మదాపురం

ప్రసవాల పెద్దాసుపత్రి!

- **జూలై నెలలో 497 కాన్పులు చేసిన ఘనత**
- **241 మందికి సాధారణ ప్రసవాలు చేసిన వైద్యులు**
- **నాణ్యమైన వైద్యంతో ఆసక్తి చూపుతున్న ప్రజలు**
- **గత కేసీఆర్ సర్కార్ కృషి ఫలితమే అంటున్న జనం**

ఒక్కరోజే అత్యధిక ప్రసవాలు చేసిన ఆసుపత్రి వైద్యులు

ఖమ్మం సిటీ, ఆగస్టు 3 : జిల్లా కేంద్రంలోని పెద్దాసుపత్రి ప్రసవాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే వైద్యులు సరాసరి రోజుకు 20 వరకు ప్రసవాలు చేస్తున్నట్లు గణాంకాలే చెబుతున్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వం ఖమ్మం జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరు చేసిన సంగతి తెలిసిందే. దానికి జిల్లా సార్వజనీన ఆసుపత్రిని అనుసంధానించడం, అనుభవజ్ఞులైన వైద్యులు సరిపడా సిబ్బందిని నియమించడంలో వైద్య సేవలు మరింత మెరుగయ్యాయి. దీనికితోడు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయించుకుంటే ఖర్చు తడిసి మోపెడవుతున్న నేపథ్యంలో పేద, మధ్యతరగతి వర్గాల గర్భిణులు పెద్దాసుపత్రికి క్యూ కడుతున్నారు. వీటన్నింటి నేపథ్యంలో ఇటీవలి కాలంలో కాన్పుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది. కేవలం జూలై నెలలోనే 497 ప్రసవాలు జరిగాయంటే వైద్యుల పనితీరును అర్థం చేసుకోవచ్చు. వాటిల్లో 241 మందికి సాధారణం, మరో 256 సీ సెక్షన్.. కలిపి మొత్తం 497 కాన్పులు నమోదయ్యాయి. కాగా.. శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు ఒక్కరోజే 34 మందికి ప్రసవం జరిపించగా.. వారిలో 20 మందికి నార్మల్ డెలివరీ చేయడం గమనార్హం. ఈ సంఖ్య ఇటీవలి కాలంలో అత్యధికం. కాగా.. ఎంతో సహనంతో ఎక్కువ ప్రసవాలు జరిపించిన డాక్టర్ ఆస్రా, డాక్టర్ మీనా, డాక్టర్ సంధ్యలను మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

గత కేసీఆర్ సర్కార్ కృషి ఫలితమే..

పేదల ఆరోగ్యంపై గత కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తల్లీ, బిడ్డల మరణాల రేటును తగ్గించేందుకు అత్యాధునిక వార్డులతో కూడిన మాతా, శిశు సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణుల సౌకర్యార్థం 104 వాహనాలను అందుబాటులోకి తేవడం, న్యూట్రిషన్ కిట్లను సరఫరా చేసింది. అలాగే బిడ్డ పుట్టిన వెంటనే 15 రకాల వస్తువులతో కూడిన 'కేసీఆర్ కిట్'ను అందించేది. దీంతోపాటు కాన్పు కోసం వచ్చిన మహిళకు అవసరమైతే తప్ప విధిగా సాధారణ ప్రసవం చేయాలని దిశానిర్దేశం చేసింది. తద్వారా తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలన్న లక్ష్యంతో ప్రత్యేక విధి విధానాలకు రూపకల్పన చేసింది. నయాపైసా ఖర్చు లేకుండా ప్రసవ అనంతరం తల్లీ, బిడ్డను క్షేమంగా గౌరవంగా ఇంటికి పంపించేవారు. ఈ తరహా పకడ్బందీ కార్యాచరణ ఫలితంగానే ప్రసవం కోసం ఖమ్మం జిల్లా సార్వజనీన ఆసుపత్రికి గర్భిణులు పోటెత్తుతున్నారని ప్రజలు ఇప్పటికి చర్చించుకుంటున్నారు.

5న పాల్వంచలో అథ్లెటిక్స్ ఎంపికలు

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 3 : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5న ఉదయం 8 గంటల నుంచి పాల్వంచ శ్రీనివాస కాలనీ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్స్‌లో జిల్లా సీనియర్స్ అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కే.మహిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీ, పురుషులు, 23 ఏళ్ల లోపు బాలబాలికలకు 100, 400, 800, 1500, 3000, 5000 మీటర్ల పరుగుపందెం అంశాల్లో జిల్లాస్థాయిలో ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 10న మెదక్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఇక్కడ ఎంపికైన వారిని పంపుతామని, జిల్లాలోని క్రీడాకారులు ఈ నెల 5న ఉదయం 8 గంటలకు అథ్లెటిక్స్ కోచ్ నాగేందర్, సెల్ నంబర్ 9963659598లో సంప్రదించాలని కోరారు.